
# గిరికథ

లలిత




మద్రాసులోని ఎస్ప్లనేడ్, కలకత్తాలోని మరేదో వీధిపేరూ స్వాతంత్ర్యానంతరం నేతాజీ సుభాస్‌చంద్రబోస్ రోడ్‌గా (ఎన్. ఎస్. సి. బోస్ రోడ్) మార్పు చెందేయి. పరిణామశీలమైనది కాలం. దానికి మార్పు సహజం. గిరులు— వాటి పుట్టు (తెలియదు) పూర్వోత్తరాలు (తెలిసినంత వరకు) ముచ్చటించుకునే ముందు, గిరికి నగము, అచలము అన్న పేర్లెలా వచ్చాయో, రాకముందు గిరి కథ లెలా ఉండేవో తెలుసుకుందాం :

నగ—రవి—జయం : కర్మ సూత్రానికి కట్టు పడిన కర్మసాక్షి అనునిత్యమూ మేరువుకు ప్రదక్షిణం చేస్తూండగా, ఓర్వలేక, వింధ్య తన చుట్టూ తిరగమని కోరి, విఫల మనోరథయై, విన్నబోయి, అహం దెబ్బతినగా, హుంకరించి, పెచ్చు పెరిగి, సూర్య చంద్రాదుల గతులను నిరోధించింది.

లోకానికి వెలుగూ లేదు, వేడీలేదు ! తెల్లదనమూ లేదు, చల్లదనమూ లేదు ! ! వాటిల్లిన ఈ లోకోపద్రవాన్ని వారించాడు లోపాముద్రాపతి అగస్త్యుడు. తాను తిరిగి వచ్చేవరకు అణగి ఉండమని ఆనతిచ్చాడు అగస్త్యుడు. తరలి వెళ్లిన అగస్త్యుడు తిరిగి వచ్చే దెన్నడు ? వింధ్య తల ఎత్తుకుని నిలిచే దెన్నడు ?

కొండ నాలుక్కి మందువేస్తే, ఉన్ననాలిక వూడినట్టయింది వింధ్యపని. మేరు నగానికీ, రవికీ జయం కలిగింది. వింధ్యకి శృంగ భంగమైంది. (కొవ్వున పోతరించిన పొట్టేలు కొండనుఢీకొంటే కలిగే ఫలమే శృంగ భంగం ! !)

నగమూ, రవీ పాత్రలుగా ఉన్న మరోకథ యథా మూషిక మూషికాః. ఒకానొకప్పుడు ఒక మునికి ఒక యెలుకపిల్ల దొరుకుతుంది. ఆలోచనా శక్తి లేని జంతు జాలానికి ఆపద లెదురవుతాయని, తన్నివారణార్థం ఎలుకను కలికిగా మార్చి, ఏ్ర పెళ్లి సంబంధాలు వెదుకుతాడు.

అంబోధి గంభీరుడని, తన పెంపుడు కూతుటని వరించమని అతనిని అర్థిస్తాడు. "పాలు పొడుగునా నా జలాలు ఇంకింపజేసే సూర్యుడు నాకన్న మిన్న కన్నెను అతనికిచ్చి పెళ్లి చెయ్యడం ఉత్తమం—" అని విన్నవిస్తాడు, సముద్రుడు.

సరేనని, మునిరాజు దినరాజు నర్థిస్తాడు. "నేను మబ్బుల చాటు వాణ్ణి. అతని (మేఘుని) ముందు నా ప్రతాపాలు, తాపాలూ పని చెయ్యవు. తాపసీ ! అతన్ని సంప్రదించండ" అన్నాడు సరోజాప్తుడు.

తనను చెల్లా చెదురు గావించే వాయువు తన కంటె గొప్పవాడని మేఘుడు వెల్లడిస్తాడు. ఎంత వీచినా సుంతైనా చలించని కొండ తనకంటె గొప్పదని వాయువు వాపోతాడు. కడవంత గుమ్మడి కత్తిపీటకి లోకువన్నట్లు తాను ఎలుకకి లోకునని తన బలహీనత దాపరికం లేకుండా గిరీంద్రుడు మునీంద్రునితో ముచ్చటిస్తాడు. ముని యథాప్రకారం కలికిని యెలుకను గావిస్తాడు.

.....ఇవి గిరులకి పలుకూ, చలనమూ గల వాటి కథలు. నాడు, కొండలకి రెక్కలుండేవి. అవియెగిరి ఇబ్బందులు కలిగించగా ఇంద్రుడు వజ్రాయుధంతో వాటి రెక్కలు ఖండిస్తాడు. వాటి నుంచి వాటికి అచలములని (చలనము లేవిని) నగములనీ (గమనము లేనివి) నామాంతరాలు వచ్చేయి.

రవి తూరుపు కొండల్లో ఉదయించి పడమటి కొండలలో అస్తమిస్తాడు. ఆ కొండలకి క్రమంగా ఉదయాద్రి, అస్తాద్రి అని పేర్లు.

అనుకరణ సహజాత్వం గల మానవుడు అనుకూల వసతులు కల్పించుకోడానికి ఆదర్శ ప్రాయమైనవి కొండగుహలు. వాటిని చూసి, అనుకరించి, తల దాచుకుందికి నెలవేర్పరచుకున్నాడు మానవుడు.

కొండల్ని పగలగొట్టి బాటలు నిర్మించుకున్నాడు. మర్త్యుడు బాటలు వేసుకోడానికి కొండల్ని పిండిచేస్తే, అమర్త్యులు కవ్వంగా వాడుకున్నారు.

ఉదధి రత్నముల చేత తనియక, ఘోర కాకోల విషానికి వెరువక, అమృతము వొడము దనక— యత్నమును విడువని, నిశ్చితార్థంబు వదలని నిపుణ మతులకు, పాల వెల్లి భాండము కాగా, కూర్మము కుదురు కాగా, వాసుకి రజ్జువు కాగా, అమృతం చిలకడానికి మందరము కవ్వమైంది.

సురుల ప్రయత్నం ఫలించి, వాళ్ళు కొండెక్కేరు. కొండంత ఆశతో పాటుపడ్డ అసురుల ఆశాజ్యోతి కొండెక్కింది. కొండని తవ్వి ఎలుకని పట్టినట్టు

యుంది వాళ్లపని. వాళ్ల గుండెల్లో అగ్ని పర్వతాలు బద్దలై 'లావా' ప్రవహించింది.

గిరికీ హరికీ యేదో అవినాభావ సంబంధం ఉంది. హరి, గిరి ! గిరి, హరి ! కూర్మావతారంలో హరి గిరిని మోశాడు. వరాహలక్ష్మీ నరసింహ స్వామిని సింహాద్రి మోసింది. రామావతారంలో కొండలు రాముని సముద్రం దాటించేయి. కృష్ణావతారంలో కృష్ణుడు గోవర్ధన గిరిని చిటికెన వ్రేలితో మోశాడు.

గిరిధరుడన్న పేరు గిరిని ధరించిన హరికే కాక గిరిచే ధరింపబడిన హరునకు కూడా అన్వయిస్తుంది, నిగ్రహంతో విగ్రహ వాక్యం నిర్మిస్తే!

రజత గిరిధరుని సతి "హిమగిరి తనయే హైమవతి" శైలరాణ్ణందన! నగరాజకుమారి! గిరిజ! శైలజ. అచ్చ తెలుగులో వడకు గుబ్బలి కూతురు.

కూర్చుని తింటే కొండలు సైతం తరుగుతాయని, శివుడు కొండ తలకింద పెట్టుకున్నా నాలుగు రాళ్ల కోసం భిక్షాటనం— అవలంబించేడు.

కొండలపై గల పుణ్యక్షేత్రాలలో తిరుపతి భద్రాద్రి విష్ణుక్షేత్రాలు, శ్రీశైలం, కోటప్ప కొండ మొదలగునవి శైవ క్షేత్రాలు. మన పూర్వ శిల్పి సమ్రాట్టుల పనితనమంతా దేవాలయాలపై మలచిన బొమ్మలలో వ్యక్తమవుతుంది.

హిందువుల శిల్పం, సంపదా కొల్లగొట్టాలని తురుష్కులు తలపెట్టేరు. పాపభీతీ, దైవభక్తీ లేకుండా ఎన్నో దేవాలయాలు నేలమట్టం చేశారు. వాళ్లకి సింహాచలం దగ్గర శృంగ భంగం జరిగింది.

# గిరికథ

గోకులపాటి కూర్మనాధకవి దైవభక్తి వల్ల పాపం పరాజితయై పుణ్యానికి జయం లభించింది. "వైరి హర రంహ సింహాద్రి నారసింహ" అనే మకుటంతో సీసపద్య శతకం చెప్పగా, లెక్కకు మిక్కిలి కంచు తుమ్మెదలు పుట్టుకొచ్చి తురుష్కులని తుమ్మెదల మొట్టవరకు వెంట బెట్టేయి. తురకలు వెను తిరిగి చూడకుండా పలాయనం పఠించారు.

ఎంత బలవంతుడైనా విధికి బానిసే అన్న సూక్తి పై సంఘటన వల్ల ఋజువవుతుంది. దైవం తోడ్పడితే రాజధర్మాన్ని ఉల్లంఘించినా ఫరవాలేదు. ఇందుకు తార్కాణం సర్కారు వారి సొమ్ముతో కంచెర్ల గోపన్న భద్రాచలంలో కట్టించిన రామాలయమే. అతని జన్మభూమి కొండపల్లి.

కంచెర్ల గోపన్న కొండ మీద గుడి కట్టిస్తే, కవికుల తిలకుడు కాళిదాసు ఆషాడ మాసపు ప్రథమ దివసాన సానువుపై యక్షునిచేత అతని ప్రేయురాలికి మేఘ సందేశం బట్వాడా చేయిస్తాడు.

మహాకవి మేఘ సందేశం వ్రాయగా, కవి సమ్రాట్టు శ్రీ విశ్వనాధ సత్యనారాయణగారు గిరి కుమారునిచే ప్రేమ గీతాలు ఆలపింప జేశారు. ప్రభుత్వ ఆస్థాన కవి కీ. శే. శ్రీ పాద కృష్ణమూర్తిగారు "వేదాద్రి మహాత్మ్యం" విరచించారు.

కొండలకీ, సాహిత్యానికీ, కళలకీ మంచి అనుబంధం ఉంది. ప్రసిద్ధులైన కథకులు, నాటిక రచయితలు, కవులు, నటులు, ప్రభువుల పేర్లు పరిశీలిస్తే వాటిలో కొండలు కనబడి తీరుతాయి.

రెండు పుణ్యక్షేత్రాలు కలసి యేర్పడిన నామధేయం గౌరవనీయులైన గవర్నరు మాన్యశ్రీ వి. వి. గిరిగారిది. శ్రీవారి పూర్తి పేరు వరాహగిరి వెంకటగిరి.

ఈ రచన మా ప్రాంతంలో నచ్చక పోయినా, ఇతర ప్రాంతీయులకి నచ్చినా "దూరపు కొండలు నునుపు" అన్నసామెత నిజమవుతుంది. రచన ఇంకా పొడిగిస్తే కొండవీటి చేంతాడవుతుంది.

"గిరికథ" సరి కొత్త పేరు కాదు. పాతదే అని మాత్రం గుర్తుండి, ఎవరి వల్ల ఆ పేరుకి ప్రఖ్యాతి లభించిందో తెలియకపోతే అది కొండ గురుతు.

ప్రప్రథమంగా గిరికథ చెప్పినవారు, సంగీత, సాహిత్య, నృత్య నిష్ణాతులు, బహుభాషాకోవిదులు హరికథా పితామహులు శ్రీ మదజ్జాడ ఆదిభట్ల నారాయణ దాసుగారు. ఆయన శత జయంతికి ప్రత్యేకంగా తపాలా బిళ్లలు వెయ్యాలని సంకల్పించడం ముదావహం. ఆ సత్సంకల్పం సిద్ధించాలని అందరి ఆశయం. కొండంత దేవుడాయన. కొండంత పత్రి నేనెలా తేను ? చంద్రున కొక నూలు పోగు.

ఆ కళాపూర్ణునకు వినయ వినమిత ప్రణామములు. ★

